క్లుప్తంగా

యు డైస్‌తో విద్యార్థుల గణాంకాలు



యు డైస్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: పాఠశాలల యు డైస్‌తో విద్యార్థుల గణాంకాలు పక్కాగా ఉంటాయని ఎంఈఓ-1 సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో యు డైస్ సక్రమంగా ఉన్నదీ లేనిదీ మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల వివరాలను ప్రతి ఉపాధ్యాయుడు అందించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రొఫైల్ అప్‌లోడ్ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాలనుంచి వివరాలు రావడం వల్ల ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి కచ్చితమైన నివేదిక అందించనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాఠశాలలో విద్యార్థులు ఎంతమంది ఉన్నారో స్పష్టంగా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుభాష్‌చంద్రబోస్‌కు నివాళులు



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యువత

బలిజిపేట: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా బలిజిపేట మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టేట్‌బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ గొప్ప వ్యక్తి అని అందువల్లనే ఆయనకు నేతాజీ అనే బిరుదు ఉందని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో చురుకైన పాత్రపోషించిన గొప్ప పోరాటవీరుడని కొనియాడారు. అటువంటి మహానుభావుని స్మరించుకోవడం మన అందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో జి.శ్రావణ్‌కుమార్, ఎం.శ్రీను, కె.గౌరీనాథ్, పి.పరశురాం, సీహెచ్.అప్పలనాయుడు, యువకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సుమిత్ర పురంలో జరుగుతున్న కాలువ, సీసీరోడ్డు పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజావసరాలకు అనుగుణంగా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీతానగరం మండలంలోని సుమిత్రాపురంలో సర్పంచ్ బొత్స నందిని, వైఎస్సార్‌సీపీ మండలనాయకుడు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.6 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు, కాలువల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం, మండల ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలు సామాజిక పరమైన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు చేయించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ బొత్స నందిని మాట్లాడుతూ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడం వల్ల తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ఆదేశించడంతో గ్రామంలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

సాలూరు: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని సాలూరు - మామిడిపల్లి మార్గంలో మంగళవారం నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తూ వాహనాలు నడపడం వలన చాలా వరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో పలువురు మరణించడం, మరికొంత మంది తీవ్ర గాయాలపాలవుతున్నారని ఫలితంగా వారితో పాటు వారి మీద ఆధారపడిన వ్యక్తులు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణం చేయరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.

భక్తజన శంబరం

- సిరిమానోత్సవానికి తరలివచ్చిన భక్తులు
- మొక్కులు చెల్లించి వేడుకున్న గిరిజన ప్రజలు

మక్కువ/సాక్షి ఫొటోగ్రాఫర్: పోలమాంబ జాతరకు తరలివచ్చిన భక్తిశ్రద్ధలతో అమ్మవారి సిరిమానోత్సవాన్ని దర్శించి అమ్మ కరుణా కటాక్షాలు తమపై ఉండాలని కోరుకున్నారు. లక్షలాదిగా తరలివచ్చిన సిరిమానోత్సవాన్ని తిలకించి పులకించారు. తమ ఇలవేల్పు ఎల్లవేళలా తమను కాపాడాలని ప్రార్థించారు. పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవం దృశ్యాలిలా ఉన్నాయి.



సిరిమానును మొక్కుతున్న భక్తులు



పూజారి కారికి పూజలు చేస్తున్న భక్తులు



పోలమాంబ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు అమ్మవారి చిత్రపటాలను అందజేసిన దేవదాయశాఖాధికారులు



జాతరలో ఖర్జూరం తదితర వస్తువుల అమ్మకాలు



సిరిమానోత్సవాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీలు



భక్తులతో కిక్కిరిసిన శంబర



చిన్నారిని భుజంపై ఎక్కించుకున్ని జాతరకు వస్తున్న యువకుడు



తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు



అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో హేమలత



సాంస్కృతిక కార్యక్రమం



సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

మహిళను లక్షాధికారిని చేయడమే సీఎం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే సీఎం జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలకసంఘం పరిధిలోని బొగ్గుల వీధిలో పట్టణ ప్రగతి యూనిట్ మిర్చి మసాలా తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబాన్ని నడిపించడమే కాకుండా సమాజానికి మార్గదర్శకంగా నిలవాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో ఉపయోగపడేలా ఇలాంటి తయారీ కేంద్రాలను స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేసి వారి కాళ్లపై వారు నిలబడడమే కాకుండా మరో 10మందికి ఉపాధి కల్పించేలా చూడడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. నియోజకవర్గం పరిధిలో బలిజిపేట మండలం గంగాడ గ్రామంలో రూ.కోటి, సీతానగరం మండలం చినభోగిలి మహిళా సంఘానికి రూ.30లక్షలు సబ్సిడీ రుణాన్ని మంజూరు చేయడమే కాకుండా వారి చేతివృత్తి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంగా కృషిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, కౌన్సిలర్‌లు ఆర్. చిన్నంనాయుడు, బి.ఆనంద్, మెప్మా, సీఎంఎంలు, సీఓలు, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు



పార్టీలో చేరిన నాయీ బ్రాహ్మణ సంఘం పెద్దలు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం పెద్దలకు కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు మెచ్చి పార్టీపై నమ్మకాన్ని ఉంచి పార్టీలోకి చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. రానున్న కాలంలో సీఎంగా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్‌లు రణభేరి చిన్నంనాయుడు, సువ్వాడ శ్రీనివాసరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్రలో
ఉచితవైద్య సేవలు



గ్రామసభలో మాట్లాడుతున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న ఉచితవైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారం సీతానగరం మండలం పాపమ్మవలసలో సర్పంచ్ ఎం.గౌరునాయుడు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా హాజరైన డీఎంఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు గ్రామాల్లో అందించాలన్న సంకల్పం గొప్పదన్నారు. ఉచితవైద్యశిబిరాలు నిర్వహించడం వల్ల దీర్ఘకాలంగా వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారంతా గ్రామాల్లోనే వైద్య సేవలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా సమన్వయకర్త రెడ్డి సింహాచలం,వైద్య సిబ్బంది, గ్రామవలంటీర్లు పాల్గొన్నారు

ముగిసిన శిక్షణ

పార్వతీపురంటౌన్: జనవిజ్ఞాన వేదిక, పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స అంశంపై శిక్షణ తరగతులు మంగళవారం ముగిసినట్లు జన విజ్ఞాన వేదిక సభ్యుడు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు పాముకాటు, వడదెబ్బ, విద్యుత్‌షాక్, చెట్టుపై నుంచి కిందకు పడిన సమయంలో, జ్వరాలు, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఎలాంటి ప్రాథమిక చికిత్స అందించాలనే అంశంపై అవగాహన కల్పించామని చెప్పారు. గిరిజన గ్రామాల నుంచి 30మంది యువత ఈ శిక్షణను అందుకున్నారని తెలిపారు. శిక్షణ అనంతరం వారందరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో డీపీఓ ధనలక్ష్మి, జన విజ్ఞాన వేదిక సభ్యులు పి.రంజిత్ కుమార్, డి.చంద్రమౌళి, కె.చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో వార్డుమెంబర్లు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: గ్రామపంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో వార్డు మెంబర్లు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన ప్రజలతో ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు మెంబర్ల విధులు-విధానాలు హక్కుల అంశంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక పరమైన సమస్యలను వార్డు మెంబర్ గుర్తించి పంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో చర్చించి ప్రాధాన్యతా క్రమంగా పనులు చేయించాలని సూచించారు. గ్రామాల్లో జరగాల్సిన పనులకు ముందుగా ప్రణాళికలు తయారు చేసుకుని చేపట్టాలని చెప్పారు. అందుకు వార్డు మెంబర్లు ప్రజల సమస్యలను తెలుసుకోవడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. స్థానికంగా శిక్షణ పొందిన అంశాలను గ్రామ పంచాయతీ సమావేశాల్లో చర్చించి ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డు మెంబర్ల హక్కులను వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టడానికి సిద్ధం కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన చైర్మన్



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సాలూరు: పట్టణంలోని గుమడాం సమీపంలో నిర్మాణమవుతున్న టిడ్కో గృహ సముదాయాలను టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మంగళవారం పరిశీలించారు. 1248 గృహ సముదాయాలపై ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన నేపథ్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో ఇళ్లను లబ్ధిదారులకు అందించే దిశగా, మౌలిక వసతులు పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ జయరాం, టిడ్కో సూపరింటెండెంట్ నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదల కంటి చూపు కోసం
జగనన్న ఆరోగ్య సురక్ష

పార్వతీపురంటౌన్: పేద ప్రజలకు కంటి చూపు కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లిలో ప్రజలకు నేత్ర పరీక్షలు, వైద్య చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా కంటి సమస్యలు ఉన్నవారికి కళ్లజోళ్లు అందించడం, శస్త్రచికిత్సలు చేయించడంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా మందుల పంపిణీ, దృష్టిదోషం ఉన్నవారికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ, ఉచితంగా శస్త్రచికిత్స లు చేసినట్లు తెలిపారు. ఇంకా కొంత మందికి కళ్లజోళ్ల పంపిణీ, శస్త్రచికిత్సలు నిర్వహించి కంటి చూపు కాపాడాల్సిన బాధ్యత జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డి, నేత్ర వైద్య సహాయకుడు ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లతో మెరుగైన వైద్య సేవలు

- ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్



రోగుల ఓపీని రిజిస్ట్రేషన్ చేయిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ పావని

సీతానగరం: గ్రామాల్లో వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఇళ్లవద్దనే స్పెషలిస్ట్ డాక్టర్లతో మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని ఆర్.వెంకంపేటలో మంగళవారం సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ పావని, సీహెచ్ఓ ఎస్వీరమణల ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ డాక్టర్లతో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించిన ఎంపీడీఓ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో జరుగుతున్న రెండవవిడత జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆర్ వెంకంపేటలో జరిగిన జగనన్న ఆరోగ్యసురక్ష ఉచితవైద్యశిబిరంలో చిన్న పిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ భరత్, బోన్‌స్పెషలిస్ట్ డాక్టర్ దుర్గాప్రసాద్ నేత్ర వైద్యుడు కె.రమేష్‌లు 301 మంది రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారని తెలిపారు. గతంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం ద్వారా సాంకేతికపరమైన సమస్యల కారణంగా పాల్గొనలేని వారికి, అప్పట్లో వైద్యసేవలు పొందిన వారికి స్థానికంగా వైద్య సేవలు పొందడానికి వీలుగా ప్రభుత్వం రెండవవిడత జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తెలియజేశారు. డాక్టర్ పావని మాట్లాడుతూ సర్పంచ్,గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో ఉదయం నుండి సాయంత్రవరకూ వైద్య శిబరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుమారవర్మ, వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, వలంటీర్లు,పాల్గొన్నారు.